# కాబందుల విందు

విశ్వమిత్ర

ఉద్యోగంలోజేరి రెండేళ్లైనా వెంకట్రావు తనతో పనిచేసే వాళ్లందరికీ ఎంతో ఇష్టుడయ్యాడు. ఆ మాటకొస్తే అతను తన పైఅధికారులక్కూడా ప్రీతి పాత్రుడయ్యాడు.

ఆ పట్టణానికి సంబంధించిన రైల్వే పార్సిల్ ఆఫీసులో లోడింగ్ అండ్ అన్‌లోడింగ్ గుమాస్తా ఉద్యోగమే వెంకట్రావు చేసేది; ఐనా అంత చిన్న ఉద్యోగిగా స్టేషన్‌లో ఉన్నవాళ్లందరికీ అతనంటే అభిమానం ఏర్పడటానికి కారణం ఉండనేవుంది.

వ్యాపార కేంద్రమైన ఆ రైల్వే స్టేషన్‌లో పార్సిల్స్ బుకింగ్‌వాళ్లు చాలా ఎక్కువ. అదేవిధంగా దిగుమతయే పార్సిల్స్‌కూడా అధికం; పార్సిల్స్ పాసెంజర్ బళ్లల్లోకి ఎత్తించటం వచ్చిన పార్సిల్స్ దింపించటం వెంకట్రావు బాధ్యత. వెంకట్రావు అనుభవం ఎంతదూరం వెళ్లిందంటే-పార్సిల్‌మీద అతని కన్నుపడటం ఆలస్యంగా అందులో ఉన్న సరుకు ఏమిటో తెలుసుకోవటమే కాకుండా, ఎంత కట్టుదిట్టంగా పాక్‌చేసిన పార్సిల్ ఐనప్పటికీ, ఎటు పక్కనుంచి తేలిగ్గా బొక్కపెట్టి సరుకు లాగాలో క్షణంలో కనిపెట్టి, తదనుగుణంగా కాజెయ్యటంలో సాటిలేని మేటి అయ్యాడు.

ఐతే వెంకట్రావు స్వార్థపరుడుకాదు. చాలీచాలని జీతాల్తో సతమతమౌతున్న స్టేషన్ సిబ్బందినిగూర్చి, వారి వారి సమస్యల్నిగూర్చి బాగా ఆలోచించేవాడు అందుకనే అతను అపహరించే సరుకును అందరికీ తలా కాస్తా అందజేస్తూ, తన వాటా తాను తీసుకుండేవాడు. రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ కానిస్టేబుల్స్‌నుంచి, ఇనస్పెక్టర్‌దాకానూ, పోర్టర్లదగ్గర్నుంచీ, స్టేషన్‌మాస్టర్‌దాకానూ, రకరకాల సరుకులూ సరఫరా చేయటంలో అతను శక్తివంచనలేకుండా శ్రమపడేవాడు. "తిలా కాష్టం తలాపిడికెడూ!" అనే సామెతను అనుసరిస్తూండేవాడు.

ఏవైనా ఫిర్యాదులు పైఅధికారులకు వెళ్ళినా, స్టేషన్ సిబ్బంది అంతా వెంకట్రావు పక్షమే. అతన్ని కాపాడేందుకు అందరూ ఒకేతాటిమీద నడుస్తారు. పార్సిల్స్‌కుపడే తొర్రలు తమ స్టేషన్‌లో కాదనిఅందరూవాదిస్తారుఅభేద్యంగాజరిగే యీ దొంగతనాల్లో ఎవర్ని బాధ్యుల్ని చేయాలో తెలియక రైల్వే అధికారులు కొన్ని క్లెయిమ్స్ ఇచ్చుకోక తప్పటం లేదు. యీ దొంగతనాన్ని అరికట్టడం బ్రహ్మతరం కాదని తేల్చుకొని, అనవసరపు విచారణల్ని జరిపే శ్రమకూడా లేకుండా, క్లెయిమ్‌లు ఇచ్చుకోవటం రైల్వే అధికారులకు పరిపాటిఐంది. 'ఎవరికి పుట్టిన బిడ్డరా వెక్కి వెక్కి ఏడుస్తోంది!' అన్నవిధంగా ఎవరికి వారు మిన్నకుండటం జరుగుతోంది. వెంకట్రావు హస్తలాఘవం పరిపూర్ణస్థితికి వొచ్చింది.

పార్సిల్ ఎక్స్‌ప్రెస్ వస్తోందనగానే వెంకట్రావు ఉత్సాహం ద్విగుణీకృతమైంది. అందులో అనేకరకాల పార్సిల్స్-కూరగాయలూ-పళ్ళూ, అనేక దినుసులూ పుస్తకాలూ, పత్రికలూ - ఒకటేమిటి కుప్పలు తిప్పలుగా అనేక శాల్తీలు దించబడుతవి. ఆచారం ప్రకారం కోటా ప్రకారం అన్నీ వెంకట్రావు వడబోతకావాల్సిందే కదా!

ఆనాడు దిగిన పార్సిల్స్‌లో ఒకపెద్ద జాజికాయ పెట్టె వెంకట్రావు దృష్టిని విశేషంగా ఆకర్షించింది. పైన ఉన్న లేబిల్ చూడగా, అవి మిఠాయిలని అర్థమైంది. ఘ్రాణశక్తిని పదునుచేసి చూడగా నోరు ఊరించే అనేక తీపి పదార్థాలు లోపల ఉన్నవనే విషయం తెలిసిపోయింది. మిఠాయిలు పార్సిల్‌గా రావటం చాలా అరుదు. స్టేషన్‌సిబ్బంది అంతా స్వీట్ ఆరగించాలనే ఉద్దేశ్యంతో ఏ దయామయుడో అంత పెద్ద జాజికాయపెట్టెలో సరుకు రవాణాచేసి ఉండాలి. వెంకట్రావు చెయ్యి ఎంత తొందరపడుతున్నా మనస్సుచేసే హెచ్చరికల్ని పాటించి సమయంకోసం కాచి ఉండక తప్పలేదు.

దిగిన పార్సిల్స్ అన్నీ పార్సిల్ ఆఫీసుకుజేర్చి, మిఠాయిలపెట్టె మాత్రం ఆ కుప్పలో పడకుండా వాటంగా ఉండే తావులో విడిగా పెట్టించాడు వెంకట్రావు సాయంత్రం ఆరింటికి పార్సిల్ ఆఫీసు మూసేస్తారు. ఏడింటికి రక్షకభటులు కాపలా ఉండగా.నిర్భయంగా వెంకట్రావు మిఠాయిల పెట్టెకు చాకచక్యంతో బొక్కపెట్టటం, జాగ్రత్తగా సరుకు లాగటం మొదలైన పనులు జరపాలి. స్టేషన్ సిబ్బందిని ఇళ్లకు వెళ్లవద్దనీ అందరికీ మిఠాయిలుతినే పర్వదినం ఇదనీ వెంకట్రావు హెచ్చరించాడు. ఆ ఆసామివచ్చి పార్సిల్ డెలివరీ తీసుకుంటే అందరినోటా మట్టేకనుక శుభస్య శీఘ్రంగా యీ పంపిణీ జరగాలి అనే నిర్ణయం విజ్ఞతతో కూడినదే మరి!

ఏడుగంటల శుభముహూర్తాన వెంకట్రావు జాజికాయపెట్టెను ఎదుర్కొన్నాడు. వాటంగా ఉండేందుకు ఆ పెట్టెను కాస్త జరపాల్సివొచ్చింది. చాలా బరువుఉండటంతో అది కదల్లేదు. ఆ తొందర్లో, ఆతృతలో తను గమనించలేదుకాని చాలామిఠాయిలు అందులోఉండి ఉంటాయని ఇప్పుడు బాగా అర్థమైంది. జ్ఞాపకంచేసుకుంటే ఆ పెట్టె ఒక్కటీ నలుగురు పోర్టర్లు ఎత్తి ట్రాలీమీద తీసు

కొని రావలసివొచ్చింది. దీంతో అందరూ పెద్ద పండుగే చేసుకోవచ్చనేది నిశ్చయంగా తెలిసివొచ్చింది.

చెయ్యిదూరే మాత్రం సందుచేశాడు వెంకట్రావు. న్యూస్ పేపర్ కాగితాలు పరిచి లోపల్నుంచి లాగటం ఆరంభించాడు. లడ్లేమి, జిలేబీలేమి, మైసూర్ పాక్‌లేమి, హల్వాలేమి - రకరకాలూ వొస్తున్నవి. "న్యూస్‌పేపర్ చాలలేదు, కాగితాలు తెండి!" అని ఆజ్ఞాపించాడు వెంకట్రావు.

చుట్టూఉన్న నలుగురు గుమాస్తాలూ అటూ ఇటూ పరుగెత్తారు కాని కాగితాలు మాత్రం లభ్యపడలేదు.

"కాగితాలు లేవు!" అన్నారు వాళ్లు.

వెంకట్రావుకు చాలా చిరాకువేసింది. ఏమాత్రం సహకారంలేని వీళ్లతో వేగటం ఎలాగో తెలియలేదు.

"ఆవీక్లీ పార్సిల్‌కు బొక్క పెట్టండి!" అన్నాడు వెంకట్రావు అధికారపూర్వకంగా.

"ఎక్కడ? ఎక్కడ?" అంటున్నారు గుమాస్తాలు.

ఇలాటి ఆలస్యాలు భరించే స్థితిలోలేడు వెంకట్రావు.

'మట్టిబుర్రలు - ఎందుకూ పనికిరారు!' అని విసుక్కొని, తనే వెళ్ళి వీక్లీపార్సిల్‌కు బొక్కపెట్టి పదిసంచికల్ని బైటకిలాగాడు.

"ఏజెంట్ ఏడుస్తాడు;" అన్నాడొక గుమాస్తా.

"నువ్వు ఏడు!...చాలకపోతే ఇంకా పీకాల్సివొస్తుంది! షీట్లు తెరచిపెట్టండి వరసాగ్గా!"

వెంకట్రావు తిట్టినా ఎవరూ పట్టించుకునేస్థితిలో లేరు. నోరూరించే స్వీట్స్ మీదనే అందరి దృష్టి ఉన్నది.

వెంకట్రావు వేగం పెంచాడు. త్వరలో ఒక రాసి లేచింది. అతనే జాగ్రత్తగా భాగాలువేసి, ఎవర్నీ మరిచిపోకుండా ఎవరెవరికి అందించాలో పురమాయించాడు.

"హాట్ లేమీ లేవే!" అన్నాడు ఒక గుమాస్తా.

"లోపల ఉన్నాయేమో? రేపు చూద్దాం!" అన్నాడు వెంకట్రావు. - "మానవుడి ఆశకు అంతెక్కడ!" అనుకుంటూ.

పార్సిల్‌లో చేసిన కన్నంలోంచి ఎలుకలు దూరకుండా ఉండేందుకు కట్టుదిట్టంచేసి ఆనాటి కార్యక్రమం ముగించాడు వెంకట్రావు.

"అన్నీ సగం సగం ముప్పాతికా ఉన్నవే కాని ఒక్కస్వీటూ పరిపూర్ణంగా లేదు!" అని ఒక గుమాస్తా గునిశాడు.

"మనవాళ్ల హాండ్‌లింగ్ తెలుసుగా! లోహంలాటిది ముక్కలు ముక్కలు అవుతుంది... ఐనా ముక్కలుచేసుకోకుండా తింటావా యేం?" అన్నాడు వెంకట్రావు.

ఆ రాత్రి స్టేషన్ సిబ్బంది కుటుంబాలన్నీ తేనుపులు వొచ్చేవరకూ మిఠాయిలు మెక్కాయి.

మర్నాడుకూడా పార్సిల్ ఆసామి రాకుంటే, మరికొంత లాగవచ్చని వెంకట్రావు నిర్ణయించుకున్నాడు. మనిషి ఎత్తునవున్న పెట్టెలోంచి పదోవంతు కూడా కదిలివుండవు. ఒక గుమాస్తా అన్నట్లు హాట్లు-ఏ జీడిపప్పుల్లాంటివో మధ్యలో ఉండిఉండొచ్చు. ఆ రాత్రి తినుబండారాల్ని గూర్చి తియ్యనికలలతో గడిపాడు వెంకట్రావు.

అదృష్టం కలిసొచ్చి మర్నాడుకూడా ఆ పార్సిల్ డెలివరీ అవలేదు. మళ్ళీ ఏడింటికల్లా కిందటిరోజు కార్యక్రమమే అమలుజరుపబడింది. అందరూ ఆశించినట్లు మిక్చర్ పొట్లాలూ, చిప్స్, బూందీ మొదలైనవికూడా బయటపడినవి. క్షీరసాగరమథనంలోవలె రకరకాల వస్తు



సామాగ్రి వొస్తోంది. పంపిణీలు సక్రమంగా జరిగాయి.

ఆ మర్నాడు స్టేషన్‌లో పాకీదొడ్లు కడిగే ఓబయ్యగాడు భయపడుతూ పార్సిల్ ఆఫీసుకు వొచ్చాడు.

"ఏం కావాలిరా?" అన్నాడు పార్సిల్ గుమాస్తా.

ఓబయ్య రైలురశీదు చేతికిచ్చి "మా బావమరిది పంపాడయ్యా! బొంబాయిలో సేట్‌గారి ఇంట్లోనూ, ఫాక్టరీలోనూ పాకిదొడ్లు కడిగే ఉద్యోగంలో ఉన్నాడయ్యా! వాడి కుటుంబమంతా శేక్

గారి దొడ్లుకడిగేపనిలోనేఉన్నదయ్యా!" అన్నాడు.

ఆ రశీదు చూస్తూనే గుమాస్తాకు కంపరం పుట్టింది. ఇప్పటికే సుప్రసిద్ధమైన కల్పతరువులాటి మిఠాయిలపెట్టెకు సంబంధించిన రశీదు అది!

"ఒరేయ్! ఇన్ని మిఠాయిలు మీ వాడు ఎలా పంపాడురా?" అన్నాడు గుమాస్తా.

"శేఠ్‌గారి కూతురు పెళ్లయింది స్వామీ! పుల్లిస్తరాకులమీది పెత్తనమంతా మావాడిదేనటండీ! అందులో మిలిగిన మిఠాయిలన్నీ జాగ్రత్తగా ఏరి పంపాడయ్యా!"

అది వింటూనే గుమాస్తా మూర్ఛపొయ్యాడు. క్షణాల్లో పార్సిల్‌ఆఫీసు సిబ్బందికి ఆ దుర్వార్త తెలిసిపోయింది.

"ఆ ఎంగిలాకుల్లోని మిఠాయిలు మనం తినటమేగాక, ఇంట్లోవాళ్లందరిచేతా తినిపించాంకదా!" అన్నాడొక గుమాస్తా.

"మనమేనా ఏమిటి? స్టేషన్‌మాష్టరూ, ప్రొటెక్షన్ ఫోర్స్ ఇనస్పెక్టరూ వాళ్ళ కుటుంబాల్లోని వారంతాకూడా ఆరగించారు కదా!"

"తలుచుకుంటే వాంతివొస్తోంది" అని ఒకరూ.

"వాంతివొచ్చినా బాగుండును!" అని ఇంకోరూ.

"హోక్! హోక్!..." అని వాంతి తెప్పించుకునేందుకు వ్యర్థప్రయత్నం చేసినవా రింకోరూ.

"వాంతేమి వొస్తుంది... అవన్నీ ఎప్పుడో జీర్ణమైపోయినయ్, ఇవాళ ఉదయంకూడా కొన్ని ముక్కలు తిన్నాను...ఖర్మ!" అని మరొకరూ.

"నయం-ఆ భండాలమంతా తిన్నందుకు కలరా రాలేదు!"

"వొచ్చినా బాగుండేది!"

"ఆ వెధవ మిఠాయిలు పుల్లవాసన వేసినప్పుడే నాకుఅనుమానం వొచ్చింది" అని ఒకరూ.

"ఆ పుల్లిస్తరాకుల పెత్తందార్లు ఫెనాయిల్‌పోసి పాకీదొడ్లుకడిగి, ఆ చేతుల్తోనే మిఠాయిలు ఏరినట్లున్నారు, నాకు ఫినాయిల్ వాసనకూడా తగిలింది. ఛీ...పాడు... హోక్!...హోక్..." అని ఇంకోరూ.

"ఒరేయ్ వెంకట్రావ్! మా కొంప తీశావురా. శ్రోత్రీయ బ్రాహ్మణ కుటుంబాల్లో పుట్టినవాళ్ళచేత ఎవరెవరి ఎంగిళ్లో ఎన్నివందలమందివో మింగించావు గదరా!" అని ఒకగుమాస్తా నెత్తీనోరూ బాదుకున్నాడు.

పిడుగుపాటుకు గురైన వానివలె, మొహంనల్లబడి నిశ్చేష్టుడైన వెంకట్రావు రోషంతో, "పొట్టలు పగిలేట్లుగా తిని, ఇప్పుడు నన్నంటే ఏంలాభం? ఇంకా లాగమన్నారే! చెయ్యి ఇంకా లోపలికి దోపమన్నారే!. యీ సంగతి స్టేషన్ మాష్టరుకూ, ప్రొటెక్షన్ ఫోర్స్ ఇనస్పెక్టర్‌కూ తెలిస్తే...?" అన్నాడు వెంకట్రావు.

"తెలియకుండా ఉంటుందా? నీ డొక్క పగలదీయకుండా ఉంటారా?" అన్నాడో గుమాస్తా.

వెంకట్రావు వెన్నెముకలో ఒక శీతల ప్రవాహం ప్రవహించింది.

"ఎట్లా? ప్రస్తుతానికి ఒక నెల సెలవు పెట్టి, ఊరువదిలి పారిపోతాను!" అన్నాడు వెంకట్రావు.

"ఏమన్నావు!" అన్నాడు ఛీఫ్ బుకింగ్ గుమాస్తా.

ఈ గందరగోళమంతా అర్థంకాని ఓబయ్య "అయ్యా! పార్సిల్ ఇప్పిస్తారా?" అన్నాడు.

"ఇక్కడ వేలిముద్రవేసి అదుగో అక్కడుండే చెక్కపెట్టె తీసుకెళ్ళు!" అన్నాడు గుమాస్తా — ఆ పెట్టెవంక చూసేందుకే భయపడుతూ.

ఓబయ్య వేలిముద్రవేసి పెట్టెదగ్గరికి వెళ్ళిచూసుకున్నాడు. చెయ్యిదూరే సందు వాడి కంటపడింది.

"స్వామీ! ఎవరో బొక్కపెట్టి మిఠాయిలు లాగేసారు!" అన్నాడు.

"ఇక్కడెవరూ అలాటి పనులు చేసే వాళ్లు లేరురా! మధ్యదారిలోనే జరిగి ఉండాలి" అన్నాడు ఒక గుమాస్తా. ఆ చెక్కపెట్టె త్వరగా యీ ప్రదేశంలోంచి వెళ్తేబాగుండురా బాబూ అనే అందరి మనస్సుల్లోనూ మెదులుతోంది.

చాలా కష్టంమీద ఆపెట్టెను ఓబయ్య భుజానికి ఎత్తుకున్నాడు.

"దొంగనాయాళ్ళు! ఎంగిలాకులు నాకే మేమే నయం? మా మూతులు కూడా నాకేందుకు ఎగబడ్డారు నా కొడుకులు!" అని తిట్టుకుంటూ కడుపుమంట వెళ్లగక్కుతూ సాగిపోయాడు ఓబయ్య.

ఆకులు నాకేవాడి మూతులు నాకిన సిబ్బంది కిమ్మనకుండా ఆ తిట్లు భరించక తప్పలేదు.